జిగేల్..



అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నగరంలోని హైదరాబాద్ (నాంపల్లి), సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్‌లను విద్యుత్ కాంతులతో అలంకరించిన రైల్వే అధికారులు.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

## ఉమా మహేశ్వర ఆలయంలో పరిశుభ్రత కార్యక్రమం



ఆలయంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్న గౌతమ్‌రావు, సి.కృష్ణయాదవ్

గోల్నాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో బీజేపీ నేతలు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి ఆలయం, ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు మరికంటి కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న రమణ, వెంకటేశ్వర్లు తదితరులు

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఏరియాలో కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికుల సొసైటీలను పునరుద్ధరించి వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కల్లుగీత కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు 16 అంశాలతో కూడిన నివేదిక, వినతిపత్రాన్ని ఆదివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.వెంకటనరసయ్య, ఎం.కృష్ణస్వామిగౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుంది



గౌతమ్‌రావును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి బీజేపీలో సరైన గుర్తింపు ఉంటుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కాసం వెంకటేశ్వర్లు, మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రావు, కిలారి మనోహర్, ఏ.సూర్యప్రకాష్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ రద్దు కోసం ఉద్యమించాలి

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2.50 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారికి అతి తక్కువ వేతనాలను చెల్లిస్తూ దోపిడీ జరుగుతోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ఆరోపించారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ తృతీయ మహాసభ జరిగింది. ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ మాట్లాడుతూ తీవ్ర అన్యాయానికి గురవుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంఘటితమై పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వి.ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా (మాస్‌లైన్) గ్రేటర్ కార్యదర్శి హన్మేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీ


కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కవాడిగూడ పరిధిలోని పూల్‌బాగ్‌బస్తీ కమ్యూనిటీహాలులో మూడు నెలలగా కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఆదివారం సర్టిఫికెట్లు, సబ్సిడీ ధరలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఇందిరాపార్కు చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ లయన్ హరీష్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, నిర్వాహకులు వి.మధు, బిస్వారంజన్ ఆగస్తి, ఎంఎస్ ప్రకాష్. ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ లయన్ శేరుపల్లి గణేష్ పద్మశాలీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలి

- హైకోర్టు సీనియర్ న్యాయవాది వరుణ్

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగంపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది బి.వరుణ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మూడు చట్టాలను తీసుకువచ్చిందని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఆదివారం దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మూడు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యం ఆదినీయం వంటి మూడు చట్టాలను కొత్తగా తీసుకువచ్చిందన్నారు. జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ మాట్లాడుతూ ఈ మూడు చట్టాలపై సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తూ ప్రజలు, న్యాయవాదులకు అవగాహన పెంపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## పురస్కారం ప్రదానం




నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంఘసేవకుడు, ఇంజనీర్ ఉజ్వల్ చందర్‌కు స్వామి వివేకానంద సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, ప్రముఖ సినీనటుడు బాబుమోహన్, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

# వాడవాడలా ఆధ్యాత్మిక సందడి

● పలుచోట్ల ర్యాలీలు ● నేడు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ● ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారం

**ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని పలుడివిజన్లలో అయోధ్య విజయ యాత్ర ర్యాలీలు జరిగాయి. సనాతన జాగృతి మంచ్, పలు ఆధ్యాత్మిక కమిటీల ఆధ్వర్యంలో శ్రీరామ ర్యాలీలను నిర్వహించి పలుచోట్ల జైశ్రీరాం జెండాలను, కండువాలను పంపిణీ చేశారు. సోమవారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నవితరణ కార్యక్రమాలతోపాటు అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రత్యక్ష వీక్షణకు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.**

### ఆహ్వాన పత్రాల పంపిణీ..

గోల్నాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ, ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్ని దేవాలయాలలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర చైర్మన్ పుట్టియాదగిరి ముదిరాజ్ తెలిపారు. సోమవారం జియాగూడ అంబేద్కర్‌నగర్‌లో నిర్వహించే కార్యక్రమానికి ప్రజలను ఆహ్వానిస్తూ ఆదివారం గోల్నాకలో ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



జియాగూడలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానిస్తున్న పుట్టి యాదగిరి

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సనాతన జాగృతి మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం రాంనగర్‌లో అయోధ్య విజయయాత్ర జరిగింది. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్ఎన్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కో కన్వీనర్ నవీన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర రాంనగర్ చౌరస్తా నుంచి శాస్త్రినగర్, జమిస్తాన్‌పూర్, దయారా మార్కెట్, జెమినికాలనీ ప్రాంతాల మీదుగా రామాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రజలకు, వ్యాపారస్తులకు జై శ్రీరాం జెండాలు, కండువాలు పంపిణీ చేశారు.

### అడిక్‌మెట్‌లో వాల్‌రైటింగ్స్

అడిక్‌మెట్‌లోని ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు గోవర్ధన్, రాజేష్, రఘురాం, వినోద్‌గౌడ్, నిరంజన్‌లు డివిజన్ పరిధిలోని రాంనగర్, రామాలయం వీధి, లలితానగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో జై శ్రీరాం వాల్ రైటింగ్‌ను నిర్వహించారు. వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అడిక్‌మెట్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు రమారవి, హనుమాన్ సినిమా సినీహీరో తేజ సజ్జా, తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

### విద్యానగర్‌లో..

విద్యానగర్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానానికి సంబంధించిన శ్రీరామచంద్రస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం, హనుమాన్ చాలీసా, రామానామ స్మరణ, రామస్తోత్రం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యులు ఆర్.శేషసాయి తెలిపారు.

### రాంనగర్ రామాలయంలో..

రాంనగర్ రామాలయంలో ప్రత్యేక పూజా, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ డి.రవి యాదవ్, ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు తెలిపారు.

### ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్ : సనాతన జాగృతి మంచ్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ శివాలయం చౌరస్తా, భరత్‌నగర్ తదితర ప్రాంతాలలో నిర్వహించారు.

### అయోధ్య రామసేవా సంఘం పూజలు

గాంధీనగర్ ఘంటసాల క్రీడామైదానంలో సోమవారం అయోధ్య రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు రమేష్, శ్రీను, సురేష్‌లు తెలిపారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

### అయోధ్య రామమందిర నమూనాతో ప్రచారం..



అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి అయోధ్య రామ మందిర నమూనాను తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

### వివేక్‌నగర్‌లో...

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రాములోరి ఆలయ ప్రారంభం సందర్భంగా సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలోప్రత్యేకపూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. దేవనాథం వివరించారు. రామతారక హోమం, రామభజన, అన్నదానం, ఎల్‌ఈడీ టీవీ ద్వారా అయోధ్య కార్యక్రమ ప్రత్యక్షప్రసారం, శ్రీరామకీర్తనల భక్తిగీతాలాపన, ప్రసాద వితరణ, రాత్రి దీపాల అలంకరణ జరుగుతుందన్నారు.

### 28నుంచి సుందరకాండ కార్యసిద్ధి హోమం

ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 1 వరకు అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధి హోమం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.




రాంనగర్‌లో అయోధ్య విజయయాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ ముషీరాబాద్ కో కన్వీనర్ నవీన్‌గౌడ్

### నేడు మైసమ్మ దేవాలయంలో...

గోల్నాక : గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలోని మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కాలనీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపారు. ఆలయ కమిటీ, కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్‌కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమయ్యారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడుతూ దేవాలయ ప్రాంగణంలో అయోధ్య ప్రత్యేక ప్రసారాలకోసం ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### 'ఆప్' ఆధ్వర్యంలో రామ్‌ధున్



మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

కవాడిగూడ : అయోధ్యలో రామమందిరం శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఆమ్‌ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మునిసిపల్ కార్పొరేషన్ స్థాయిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లో రామ్‌ధున్, సుందర్‌కాండ, సత్యనారాయణ స్వామి వ్రతం, మహాహారతి, మహాప్రసాద్ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## దోపిడీలేని రాజ్యం రావాలి

● సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దోపిడీ, అసమానతలు, ఆర్థిక, సంక్షోభం లేని కష్టజీవుల రాజ్యం రావాలని, ఆ దిశగా సోవియట్ రష్యా అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీ.వీ. రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో లెనిన్ చెప్పిన విషయాలు ప్రజా ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు మార్గనిర్దేశం చేస్తున్నాయని అన్నారు. భౌతికవాదం, ఆచరణవాదం విమర్శ ఆయన ముఖ్యమైన రచనగా అభిప్రాయపడ్డారు. భౌతికవాదాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత విప్లవకారులపై ఉందన్నారు. భారతదేశంలో హిందూత్వ భావాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో భావవాదాన్ని రోజువారీ యుద్ధంలో ఎలా ఎదుర్కోవాలో లెనిన్ రచనలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్

## వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీసీలకు ఎనిమిది స్థానాలు కేటాయించాలి

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన ఎనిమిది పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీసేన రాష్ట్రసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ అయితే ఎనిమిది ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయిస్తుందో ఆ పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్లుపల్లి కృష్ణయాదవ్ అధ్యక్షత వహించగా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలం యాదవ్, ప్రధానకార్యదర్శి చెన్నయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లు కోసం దేశవ్యాప్త ఉద్యమం

● ఫిబ్రవరి 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ
● ఎంపీ ఆర్.కృష్ణయ్య



ఛలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, తదితరులు

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి) : వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో బహిరంగ సభలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 5, 6 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి వేలాది మంది బీసీలతో పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో బీసీ ఉద్యోగుల సమావేశం, 28న మహబూబ్‌నగర్‌లో బీసీ టీచర్ల సమావేశం, 29న కడపలో బీసీ ఉద్యోగుల బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు సుందరయ్య, నీల వెంకటేష్, సి.రాజేందర్, పి.సుధాకర్ ముదిరాజ్, టి.రాజ్‌కుమార్, నందగోపాల్, జి.కృష్ణయాదవ్, మోదీరాందేవ్, జి.అనంతయ్య, గుజ్జ కృష్ణ పాల్గొన్నారు.

# మన సంస్కృతిని భావితరాలకు అందించాలి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్



ముషీరాబాద్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, సుదేష్

ముషీరాబాద్, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): అంతరించి పోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. ఆదివారం ముషీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌లు హాజరై మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేష్ మాట్లాడుతూ ముగ్గులపోటీలో పాల్గొని విజయం సాధించిన మహిళలకు ఈనెల 26న ఇందిరాపార్కులో నిర్వహించే పద్మశాలి రాజకీయ, చైతన్యవేదిక కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

### ముషీరాబాద్‌లో తమిళ సంక్రాంతి సంబరాలు

ముషీరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తమిళనాడు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో తమిళ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్ క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. తమిళనాడుకు చెందిన ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రతి ఏడాది సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

### రాజీవ్‌గాంధీ అండర్ -19 క్రికెట్ విజేత హైదరాబాద్



క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన రాజీవ్ గాంధీ మెమోరియల్ అండర్-19 క్రికెట్ విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు విజేతలకు ట్రోఫీ అందించారు.

- బర్కత్‌పుర (ఆంధ్రజ్యోతి):

### 'ఆటలతో మానసిక ఉల్లాసం'

అంబర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆటల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు లాయర్ల ఆధ్వర్యంలో అంబర్‌పేట వాటర్‌వర్క్స్ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని దేవునితోట, ఎస్సీఎస్టీహాస్టల్, బీఎస్ఎన్ఎల్ కవాడిగూడ, రిలయన్స్ టవర్స్‌ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 11 వరకు, ముషీరాబాద్ పరిధిలోని మెయిన్‌రోడ్, బీర్బన్‌గల్లీ, కేర్ ఆస్పత్రి, పర్వాన్‌హోటల్, రాజాడీలక్స్, బడీమసీదు, సత్తార్‌బాగ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3నుంచి 5వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు.

## ఓటర్ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

చిక్కడపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ సూచించారు. జవహర్‌నగర్ కమ్యూనిహాల్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్, ఆకుల సురేందర్, ప్రకాష్‌యాదవ్, అంగన్‌వాడి టీచర్ నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మాజీ కార్పొరేటర్ రవీందర్ రాజీనామా



కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మలిదశ ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆదివారం దోమలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన భవిష్యత్ కార్యాచరణను తన అనుచరులతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తానని ఆయన తెలిపారు.

### మహిళా కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలు ఆదివారం ఎల్బీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. బాలికల ఆత్మరక్షణ కోసం ప్రధాని మోదీ ప్రారంభించిన ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ పోటీలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు.



వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

### 'వృద్ధురాలిని గుర్తిస్తే సమాచారమివ్వండి'

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని 70 నుంచి 75 సంవత్సరాల వృద్ధురాలు రోడ్డుపై తిరుగుతుండగా పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించారు. ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరాలు తెలుసుకున్నారు. ఆమె కొత్తగూడెం ప్రాంతానికి చెందిన నరసమ్మగా గుర్తించారు. భర్త పేరు వెంకటయ్యగా వృద్ధురాలు చెప్పినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. చిరునామా, బంధువుల వివరాలు చెప్పలేకపోతుందని, ఆమెను గుర్తించిన వారు 8712660160 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు.